క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి గురువారం తెలిపారు. కమ్మకండ్రిగ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, బ్రాహ్మణపల్లెలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ కార్యాలయాలను డిప్యూటీ సీఎం ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన ఏఎంసీ చైర్మన్



మంత్రి గోవర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న కమలాకర్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి గురువారం తిరుపతి పద్మావతి వసతి గృహంలో మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. పెనుమూరు మార్కెట్ యార్డు అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. మార్కెట్ యార్డులో నూతనంగా పశువుల సంతను ప్రారంభించినట్లు తెలిపారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు అభిషేక పూజలు, ప్రత్యేక అలంకరణలు ఉంటాయన్నారు. 11 గంటలకు సుదర్శన హోమం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆవుదేవర నందీశ్వరాలయంలో

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో వెలసి ఉన్న ఆవుదేవర నందీశ్వరాలయంలో శుక్రవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఉదయం అభిషేక పూజలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నాడు-నేడు పనులు వేగవంతం




సూచనలిస్తున్న జేసీ వెంకటేశ్వర్

గంగాధరనెల్లూరు: పాఠశాలల్లో నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మండలంలోని ముసలయ్యగారిపల్లె, పాపిరెడ్డిపల్లె పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు రెండవ విడత పనులను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేసీ మాట్లాడుతూ పనులను వేగవంతంగా పూర్తి చేయించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లి తండ్రుల కమిటీలదేనని తెలిపారు. తహశీల్దారు ఇన్బనాథన్, ఎంపీడీఓ శ్రీదేవి, ఎంఈఓ రాజేంద్రన్ పాల్గొన్నారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం వ్యవసాయ బావిలో బుధవారం శవమై తేలిన వృద్ధురాలి ఆచూకీ లభ్యమైంది. ఆమె మున్సిపల్ పరిధి కాకవేడు రోడ్డులో నివాసముంటున్న రవినాయుడు భార్య కుమారి (55)గా పోలీసులు గుర్తించారు. ఏఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. కుమారికి ఐదేళ్లపాటుగా మతిస్థిమితం లేదు. బుధవారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లి మళ్లీ రాలేదు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. గురువారం ఉదయం పత్రికల్లో వచ్చిన వార్తను చూసి, మృతి చెందింది కుమారిగా గుర్తించి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించి వివరాలు తెలిపారు. మతిస్థిమితం లేని కారణంగా పారబాటున వ్యవసాయబావి వద్ద సంచరిస్తూ అందులో పడిపోయి ఉంటుందని వివరించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

వేతనం గిట్టుబాటు అయ్యేలా ఉపాధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : ఉపాధిహామీ పథకంలో రెండు పూటలా పని చేస్తే కూలీలకు వేతనం గిట్టుబాటు అవుతోందని ఎంపీడీఓ ఎస్.విద్యావతి తెలిపారు. గురు వారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి ఏపీఓ బాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజులు పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. కూలీలు ఉదయం, మధ్యాహ్నం పని చేస్తున్న చోట ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే బిల్లులు అందుతాయని పేర్కొన్నారు. ఈసీ అనుషా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



నింద్ర : సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నింద్ర : అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి అందిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా తెలిపారు. గురువారం మండలంలోని కావనూరు సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. స్థానికులు ఆమెకు హారతులు ఇచ్చి, గజమాలలతో సాదర స్వాగతం పలికారు. 'అవ్వా బాగున్నావా.. పెన్షన్ వస్తోందా? తాతా .. పెన్షన్ అందడంలో ఏవైనా ఇబ్బందులున్నాయా? అమ్మా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? బాబూ పాఠశాలల్లో విద్యా బోధన ఎలా ఉంది'? అంటూ అన్ని వర్గాల వారిని ఆప్యాయంగా పలకరించారు. ప్రజలు సూచించిన సమస్యలకు సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకంగా అందిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, తహసీల్దార్ అమరేంద్రబాబు, ఎంపీడీవో వేణు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల కన్వీనర్ వేణురాజు, కోఆప్షన్ సభ్యుడు అనిల్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, ఆర్బీకే చైర్మన్ వీరయ్య నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, డైరెక్టర్ రామచంద్రయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం, మహేష్, లక్ష్మీపతి, మహేష్, అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నగరి : యూటీఎఫ్ 2023 క్యాలెండర్‌ను మంత్రి ఆర్కేరోజా ఆవిష్కరించారు. గురువారం మంత్రి నివాస కార్యాలయంలో యూటీఎఫ్ ప్రతినిధులు మంత్రి చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంఈవో శ్రీదేవి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మునిరత్నం, సభ్యులు పాల్గొన్నారు.

కొత్త కాంతులతో పార్కుకు అందాలు



పార్కులో ఐమాక్స్ లైట్స్ ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: పుత్తూరు ప్రజల చిరకాల స్వప్నమైన పార్కును ఏర్పాటు చేయడమే కాకుండా, ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ మున్సిపల్ పార్కులో రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 16 ఐమాక్స్ లైట్స్‌ను మంత్రి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుత్తూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనునిత్యం వివిధ పనులతో నీరసించిపోయే వారు పార్కుకు వచ్చి సేదతీరుతున్నట్లు తెలిపారు. పిల్లలకు, పెద్దలకు ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందిస్తున్న ఉద్యానవనాన్ని మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ ఎన్‌రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి, కౌన్సిలర్లు రాధ, వనిత, హేమలత, భువనేశ్వరి, జయలక్ష్మి, భానుమతి, గుణశేఖర్, ఏకాంబరం, నరసింహారావు, చిట్టిబాబు, వైస్ ఎంపీపీ కె.మునస్వామిరెడ్డి, కోఆప్షన్ మెంబర్లు షకీలా, చీరాల, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రసాద్, కార్తికేయన్, ఈశ్వరయ్యాయాదవ్, మురళీయాదవ్, సుదర్శన్, జయబాబు, మునిరత్నం, చిన్నా, దేవేంద్రరెడ్డి, చక్రీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పన



అధికారులకు సూచనలిస్తున్న ఉప ముఖ్య మంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఆదేశించారు. గురువారం పద్మసరస్సు సమీపంలోని జగనన్న కాలనీని గురువారం డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మానసపుత్రికగా నిలుస్తున్న జగనన్న కాలనీల్లో విద్యుత్, మురుగు నీటి కాలువలు, తాగునీరు, ఇతర అన్ని వసతులు యుద్ధప్రాతిపదికన కల్పించాలని అధికారులకు సూచించారు. నిర్మాణాలు చేపట్టని పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి మహిళా సంఘాల ద్వారా రూ.60 వేలు వడ్డీ లేని రుణం అందించి నిరుపేదలు కూడా పక్కాగృహాలు నిర్మాణం చేపట్టేలా చూడాలని అధికారులకు తెలిపారు.

జగనన్నకు రుణపడి ఉంటాం

కాలనీలో నివాసాలు ఉంటున్న వారితో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ వసతుల వివరాలను తెసుకున్నారు. లబ్ధిదారులు పలువురు మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాల పాటు కాలువ గట్లపై గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న తమకు ఇంటి స్థలం మంజురు చేసి, పక్కా గృల్లు నిర్మించి అన్నయ్యలా ఆదుకున్న సీఎం జగనన్నకు ఎప్పుడు రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం తమను పట్టించుకోలేదని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం నిత్యం పరితపించే ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని తెలిపారు. గత ప్రభుత్వంలో పక్కా ఇల్లు నిర్మించుకుని నిధులు రాని లబ్ధిదారులకు కూడా వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా హక్కు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పక్కా ఇళ్ల నిర్మాణాలను అధికారులు వేగవంతం చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



అదనపు గదులు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీపీ లత అన్నారు. గురువారం మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో అదనపు గదుల నిర్మాణానికి ఆమె భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో ఆలయాల అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని తెలిపారు. కల్యాణ మండపంలో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.38 లక్షలు టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. స్కంధ పుష్కరిణిలో నీరాళి మండపం నిర్మాణానికి రూ. కోటి 20 లక్షలు, పుష్కరిణి చుట్టూ పార్కు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయించారని వివరించారు. అలాగే దేవదాయశాఖ నుంచి కొటార్వేడు గ్రామంలో వెలసి ఉన్న శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ. 92 లక్షలు ఉప ముఖ్యమంత్రి మంజూరు చేయించారని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, నాయకులు రామిరెడ్డి, ఢిల్లీరెడ్డి, ధనశేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి



కడపగుంటలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గంగాధరనెల్లూరు: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. మండలంలోని కడపగుంట, మహదేవ మంగళం గ్రామ సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలన్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ప్రతి రోజూ చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని తెలిపారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించి సూచనలు చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈఓపీఆర్డీ శివయ్య పాల్గొన్నారు.

సులభ రీతిలో పాఠ్యాంశాల బోధన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం : విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆముదాల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. ఆహార పదార్థాల రుచి చూశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



భ్రమరాంబను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: పూలే అవార్డు అందుకున్న మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు భ్రమరాంబను ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సన్మానించింది. హెచ్ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతులు మీదుగా శ్రీసావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారని తెలిపారు. అనంతరం 2022లో తక్కువ సెలవులు ఉపయోగించుకున్న ఉపాధ్యాయులు శ్యామల, జ్యోత్స్న, మస్తాన్, శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను అభినందించారు.

నయనానందకరం.. నటరాజస్వామి అభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి 7గంటలకు శ్రీనటరాజస్వామి, శివగామి అమ్మవార్ల అభిషేక దర్శనం నయనానందకరంగా జరిగింది. పుత్తూరు గ్రామ పురోహితులు చిట్టమూరు రమేష్‌బాబు, ధనలక్ష్మి దంపతులు ఏటా ధనుర్మాస పౌర్ణమి రోజున ఆరుద్ర ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పౌర్ణమి ముందు రోజు చతుర్థశిని పురస్కరించుకుని శ్రీనటరాజ స్వామి,శివగామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. తొలుత కలశ ప్రతిష్ట చేసి, వినాయక పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పంచామృతం, చందనం, విబూది, కలశ జలాలతో అభిషేక పూజలు నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. కనుల పండువగా జరిగిన అభిషేక పూజలను విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులు వీక్షించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ఆరుద్ర ఉత్సవం

శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, సూర్యోదయంతో ఆరుద్ర దర్శన భాగ్యం కల్పించనున్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది.

పంచాయతీ భవనం రికార్డుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న జేసీ వెంకటేశ్వర్

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానం పక్కన నిర్మించిన పంచాయతీ భవనాన్ని గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ భవన నిర్మాణంపై హైకోర్టు ఆక్షేపణలు ఉండడంతో పంచాయతీ కార్యకలాపాలు స్థానిక గ్రంథాలయ భవనంలో నడుస్తోంది. ఈక్రమంలో జేసీ పూర్తి స్థాయిలో వివరాలను ఆరా తీశారు. ఇది పంచాయతీ స్థలంలో నిర్మించారా.. .హైస్కూల్‌కు సంబంధించిన స్థలంలో ఉందా అంటూ అధికారులను అడిగారు. రికార్డులను పరిశీలించి తదుపరి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు జేసీ తెలిపారు. తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ సుధాకరరావు, ఎంఈఓ విజయకుమార్, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రీ సర్వేలో జాగ్రత్తలు పాటించాలి



సింహరాజుపురంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సుజన

పాలసముద్రం : జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం కింద రీ సర్వేలో రెవెన్యూ సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని నగరి ఆర్డీవో సుజన తెలిపారు. గురువారం మండలంలోని సింహరాజుపురం, ఆముదాల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సర్వేకు సహకరించి శాశ్వత సరిహద్దులు నిర్ణయించుకోవాలని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు ఫొటోలను సర్వే అధికారులకు రైతులు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పీవీ ప్రసాద్‌రావ్, వీఆర్‌ఓ తంగరాజ్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ల పంపిణీ



పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రామ్‌ప్రసాద్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారంలో నూతన పెన్షన్లను మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద పాత, కొత్తవి కలిపి 107 మందికి పెన్షన్లు, ఐదుగురికి రైస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ భార్గవి మాట్లాడుతూ పేదలకోసం పనిచేసే ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలన్నారు. సర్పంచ్ రవి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు మాత్రమే కాదని గ్రామంలోని ఆస్పత్రికి రోడ్డు సౌకర్యం కల్పించారని, కొండ ప్రాంతం నుంచి తాగునీటిని సరఫరాచేస్తున్నారని ఇంతలా అభివృద్ధి, సంక్షేమం ఎప్పుడూ జరిగిన దాఖలాలు లేవన్నారు. ఎంపీడీవో చంద్రమౌళి, సర్పంచ్‌లు చంద్రకళ, ప్రకాష్, ఎంపీటీసీ జ్యోతి, పాఠశాల చైర్మన్ సత్య, వెంకటరెడ్డి, కుమారస్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం




సర్వే చేస్తున్న డాక్టర్లు సునీత, సంగీత

పుత్తూరు రూరల్: ప్రతి ఒక్కరూ కుటుంబ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), టీబీ ఇండియా బృందంలోని డాక్టర్లు సునీత, సంగీత తెలియజేశారు. గురువారం వైద్య బృందం పట్టణంలోని ఎన్జీఓ, ఎన్టీఆర్ కాలనీల్లో సర్వే నిర్వహించారు. కరోనా భయాందోళనలు వెంటాడుతున్న నేపథ్యంలో ఇంటింటి సర్వే జరుపుతున్నారు. వారు మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన విషయాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. పుట్టిన బిడ్డకు టీకా వేశారా లేదా? ఎలాంటి టీకాలు వేశారు. కరోనా టీకాలు ఎన్ని డోసులు వేసుకొన్నారు. దుష్ఫలితాలు ఏమైనా ఉన్నాయా, తదితర విషయాలను సేకరించారు. పిల్లలకు టీకా తప్పని సరిగా వేయాలని సూచించారు. టీకాలు వేస్తే పిల్లలకు జ్వరం వస్తేనే టీకా పనిచేస్తున్నట్లు నిర్ధారణ అవుతుందని వివరించారు.


ఉద్యాన పంటల సాగుకు రాయితీలు

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు రాయితీలు ఇస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం చంద్రగిరికి చెందిన శ్రీనివాసులురెడ్డి పాలిహౌస్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతు శ్రీనివాసులు రెడ్డి ఏర్పాటు చేసిన పాలిహౌస్ నిర్మాణానికి సుమారు రూ.8.74 లక్షలు అయ్యిందని తెలిపారు. అందులో ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.4.37 లక్షలు ఇచ్చిందన్నారు. అందులో సాగు చేసే కూరగాయల పెంపకానికి చదరపు మీటరుకు రూ.70లు, పూల పెంపకానికి రూ.213లు రాయితీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శాశ్వత పందిరిపై తీగజాతి కూరగాయల పెంపకం కోసం ఎకరాకు రూ.2.11 లక్షలు అవుతుందని, అందులో రూ.లక్ష రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాల కోసం మండల ఉద్యాన అధికారిణి లేదా ఆర్‌బీకేలో సంప్రదించాలని సూచించారు.

సమ్మేటివ్ పరీక్షల పరిశీలన



నగరి : పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ



వెదురుకుప్పం : సమ్మేటివ్ నిర్వహణ తీరు పరిశీలన

నగరి : మండలంలోని బుగ్గకండ్రిగ పాఠశాలలో విద్యార్థుల సమ్మేటివ్ పరీక్షలను ఎంఈవో శ్రీదేవి గురువారం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యతగా వడ్డీస్తున్నారా లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు అందించిన బిసిబేలాబాత్ రుచి చూసి తగిన పదార్థాలు ఉండాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కృష్ణారామాపురం పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

వెదురుకుప్పం: విద్యార్థులు కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న సంగ్రహణాత్మక(సమ్మేటివ్) పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. హెచ్ఎం వెంకటరమణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభానికి వేళాయె..


- నేడు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభం
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేసిన ప్రభుత్వం



గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం



వైఎస్సార్ విలేజ్ క్లినిక్

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లెలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. శుక్రవారం జరిగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఈనూతన భవనాలను ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. గతంలో పంచాయతీ కేంద్రంగా ఉన్న బ్రాహ్మణపల్లెలో ఇరుకుగా ఉన్న పంచాయతీ కార్యాలయంలో పాలన అసౌకర్యంగా సాగేది. ప్రస్తుతం గ్రామ సచివాలయంగా మారి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణంతో అక్కడ కార్యాలయాల హబ్‌గా ఏర్పడింది. రూ. 40 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం, రూ. 21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టి సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ రమణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వెనక ఉన్న గుట్టపొరంబోకు స్థలాన్ని చదును చేసి అన్ని కార్యాలయాలను ఓకే చోట నిర్మించారు. దీంతో పాటు రాజ్య సభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిధులు రూ.7 లక్షలతో ఆర్‌ఓ ప్లాంట్‌ను నిర్మించారు. సచివాలయ పరిధిలో బ్రాహ్మణపల్లె, కాపుమొండివెంగనపల్లె పంచాయతీలు ఉన్నాయి. దీని పరిధిలో 2,685 మంది జనాభా, 693 కుటుంబాలు, 14 గ్రామాలు ఉన్నాయి. 13 మంది గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పని చేస్తున్నారు. కార్యాలయాల భవనాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది.